సాక్షి కుమురం భీం

గురువారం । 19 । అక్టోబర్ । 2023

ప్రచార రథానికి పూజలు



కాగజ్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్ ప్రచార రథానికి జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు దంపతులు బుధవారం మండలంలోని పెద్దవాగు సమీపంలోని మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కోనేరు రుక్మిణి, వంశీ, మధులిక, సంజయ్ సింగ్, వనమాల రాము తదితరులున్నారు.



సమస్యల్లో చిన్నుగూడ

IIIలో▸

కెరమెరి మండలంలోని పీటీజీ గ్రామమైన కెస్లాగూడ పంచాయతీ పరిధి చిన్నుగూడలో సమస్యలు తిష్టవేశాయి. ఏళ్లుగా ఇక్కడ నివసించే ఆదివాసీలు ఇక్కట్లు పడుతున్నారు.

గరిష్టం/కనిష్టం
34.0/23.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి వేళ మంచుకురుస్తుంది.

న్యూస్‌రీల్

అత్యద్భుత పాలన అందిస్తాం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్పీ



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: ప్రజా ఆశీర్వాదంతో సిర్పూర్‌లో బీఎస్పీ గెలుపు ఖాయమని, ప్రజలకు అత్యద్భుత పాలన అందిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులను బీఆర్‌ఎస్ మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని విమర్శించారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే ఏడాదికి 10 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మేనిఫెస్టోలో హామీ ఇవ్వనున్నట్లు తెలిపారు. బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర ద్వారా గుర్తించిన ప్రజలు, యువకులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలే ప్రధాన ఎజెండాగా పది ప్రధాన హామీలతో తమ మేనిఫెస్టో రూపొందించినట్లు చెప్పారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీఎస్‌పీఎస్సీని రద్దు చేసి ప్రతీ ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్నారు.

ఎస్పీని బదిలీ చేయకుంటే ఆందోళన

ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే కుమురంభీం ఆసిఫాబాద్ ఎస్పీని సత్వరమే బదిలీ చేయాలని మరోసారి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వారంలోపు బదిలీ చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీ, ఎమ్మెల్యే కోనప్పకు వత్తాసు పలుకుతున్న ఎస్పీ బదిలీ అయినప్పటికీ, అధికారపార్టీ బలంతో ఉపసంహరించుకున్నట్లు ఆరోపించారు. ఎన్నికల్లో అధికార పార్టీ నాయకులు గెలుపే లక్ష్యంగా డబ్బులు పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారని, ఇందుకు ఎస్పీని పావుగా వాడుకునేందుకే అతడిని బదిలీ చేయడం లేదన్నారు. నాయకులు అర్షద్ హుస్సేన్, సిడం గణపతి, షబ్బీర్ హుస్సేన్, నక్క మనోహర్, దోకే రాజన్న, ముస్తాఫిజ్ హుస్సేన్, సిద్దం శ్రీనివాస్, టక్కరి పోచం తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఎస్పీలో పలువురి చేరిక

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగురే శ్యాంరావుతో పాటు పలువురు బీజేపీకి రాజీనామా చేసి గురువారం కౌటాల మండల కేంద్రంలో జరిగే బహిరంగసభలో బీఎస్పీలో చేరనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సభను జయప్రదం చేయాలని కోరారు.

కలిసికట్టుగా..

- సక్కుతో బీఆర్‌ఎస్ అభ్యర్థి 'కోవ' భేటీ
- క్యాంపు ఆఫీస్‌లో గంటపాటు చర్చలు
- కుదిరిన సఖ్యత.. ప్రచారం ప్రారంభం
- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు..

జంగ్ తెలంగాణ

సాక్షి, ఆసిఫాబాద్: రానున్న శాసనసభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ వ్యూహాలకు పదును పెట్టింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కును కాదని, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి బీఆర్‌ఎస్ అధిష్టానం టికెట్ కేటాయించినప్పటి నుంచి రాష్ట్ర రాజధానికే పరిమితమైన సక్కు ఇటీవల జిల్లా కేంద్రానికి వచ్చారు. అదే సమయంలో పార్టీ 'బీ' ఫారం అందుకున్న కోవ లక్ష్మి మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆత్రం సక్కుతో భేటీ అయ్యారు. దాదాపు గంటపాటు ఇరువురు చర్చలు జరిపారు. ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని ఈ సందర్భంగా కోవ లక్ష్మి ఆత్రం సక్కును కోరినట్లు సమాచారం. అందుకు సక్కు కూడా సానుకూలంగా స్పందించడమే కాకుండా ప్రచారానికి వస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇరువురి నేతల మధ్య సఖ్యత కుదరడంతో బుధవారం వాంకిడి మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో పార్టీ శ్రేణులు ఆనందంలో మునిగిపోయారు.

విజయమే లక్ష్యంగా..

బీఆర్‌ఎస్ నిర్వహించిన సర్వే ఫలితాల ఆధారంగా ఆసిఫాబాద్ ఎస్టీ (రిజర్వ్‌డ్) నియోజకవర్గ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు కాకుండా అధినేత కేసీఆర్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న కోవ లక్ష్మికి కేటాయించిన సంగతి తెలిసిందే. సక్కుకు ఎంపీ టికెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ఇద్దరు కలిసి పనిచేయాలని పార్టీ పెద్దలు సూచించిన నేపథ్యంలో బుధవారం వాంకిడి మండలంలో కోవ లక్ష్మి, ఆత్రం సక్కు కలిసి తొలిరోజు ఎన్నికల ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఇరువురు నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తొలిరోజు మండలంలో 12 గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించగా పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వాంకిడి: గోయేగాంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

వాంకిడి మండలంలో ప్రచారం షురూ

వాంకిడి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మండలంలోని సోనాపూర్ పంచాయతీ పరిధి మహాగాం(మచ్చగూడ) హనుమాన్ ఆలయంలో ముందుగా ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సోనాపూర్ నుంచి మహాగాం వరకు బీటీ రోడ్డు మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి మాట్లాడుతూ.. తనను ఆశీర్వదించి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోకు ప్రజల్లో మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. రాజులగూడ, మాచిగూడ, చిచ్చుపల్లి, గణేశ్‌పూర్, గోయేగాం గ్రామాల్లోనూ ఎన్నికల ప్రచారం చేశారు.

దూకుడు పెంచిన బీఆర్‌ఎస్

దాదాపు నెల ముందే బీఆర్‌ఎస్ అధిష్టానం తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించిన సంగతి విధితమే. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు ప్రారంభించారు. అన్ని వర్గాలను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్ 55 మందితో కూడిన తొలిజాబితాను ప్రకటించింది. బీజేపీ మాత్రం తమ అభ్యర్థుల జాబితాను నేటికీ విడుదల చేయలేదు. ఎన్నికల మేనిఫెస్టోను ఇటు కాంగ్రెస్, అటు బీఆర్‌ఎస్‌లు ప్రకటించగా.. ఇప్పుడు అభ్యర్థులు వాటిని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రచారం ముమ్మరం చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి 'బీ' ఫారం అందుకుని జిల్లా కేంద్రానికి వచ్చిన వెంటనే ప్రచార వ్యూహానికి పదును పెట్టినట్లు తెలుస్తోంది. నియోజకవర్గానికి చెందిన ద్వితీయశ్రేణి పార్టీ నాయకులతో ఇప్పటికే ఆమె భేటీ అయ్యారు. అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని కార్యకర్తలు, శ్రేణులు, నాయకులను ఆదేశించినట్లు సమాచారం. బుధవారం కూడా కోలాం వర్గానికి చెందిన ముఖ్యనేతలతో కోవ లక్ష్మి, ఆత్రం సక్కు భేటీ అయి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ దూకుడు ప్రదర్శిస్తుండడంతో ప్రతిపక్ష పార్టీల నుంచి టికెట్లు ఆశిస్తున్న ఆశావహులు మాత్రం అభ్యర్థిత్వం ఎవరికి దక్కుతుందో తెలియకున్నా.. 'ఎవరికి వారే.. యమునా తీరే' అన్న రీతిలో ప్రచారం చేస్తున్నారు.

చేరికలకు రంగం సిద్ధం

- 21న హస్తం గూటికి బోథ్ ఎమ్మెల్యే బాపురావు
- రేఖానాయక్ చేరికకు ఇంకాస్త సమయం
- శ్యామ్‌నాయక్ రాకతో ఇద్దరిలో ఒకరికే అవకాశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్‌ఎస్‌లో మళ్లీ అసెంబ్లీ టికెట్ దక్కని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కాంగ్రెస్ పార్టీలో చేరికకు రంగం సిద్ధమైంది. ఈ నెల 21వ తేదీన చేరికకు ముహూర్తం ఖరారైంది. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ చేరికకు ఇంకాస్త సమయం పట్టనుంది. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో వీరిద్దరు సిట్టింగ్‌లకు బీఆర్‌ఎస్ టికెట్ దక్కక అసంతృప్తి ప్రకటించి కాంగ్రెస్ పార్టీకి చేరువైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరి మళ్లీ పోటీ చేసేందుకు ఖాయంగా టికెట్ ఇస్తామని హామీ దక్కితేనే కండువా మార్చేందుకు సిద్ధపడ్డారు. బోథ్ ఎమ్మెల్యే బాపురావు కాస్త ముందుగానే పార్టీలో చేరికకు రంగం సిద్ధం చేసుకున్నారు. మళ్లీ పోటీకి ఆయనకు బోథ్ నుంచి టికెట్ వస్తుందా? లేదా? అనేది వేచి చూడాలి. ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తొలి జాబితాలో నిర్మల్ నుంచి కూచాడి శ్రీహరిరావు, మంచిర్యాల నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, బెల్లంపల్లికి మాజీ మంత్రి గడ్డం వినోద్ పేర్లు వెల్లడయ్యాయి. మిగతా చోట్ల పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో కొత్తగా చేరే నాయకులు టికెట్లపై ఆశలతోనే పార్టీలోకి వస్తున్నారు. ఇప్పటికే పార్టీలో పనిచేస్తున్నవారు, టికెట్‌కు దరఖాస్తు చేసుకున్నవారి మధ్య కొత్త వారి రాక చిచ్చు పెడుతోంది.

రేఖానాయక్‌కు 'ఎంపీ'గా ఆఫర్?

బీఆర్‌ఎస్ పార్టీ తనను పక్కకు పెట్టి, మంత్రి కేటీఆర్ స్నేహితుడు భూక్య జాన్సన్‌నాయక్‌కు టికెట్ ఇవ్వడంతో రేఖానాయక్ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. కాంగ్రెస్‌లో చేరుతానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఓడించేందుకు కచ్చితంగా బరిలో ఉంటానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్‌పై ఇంకా స్పష్టమైన హామీ రాకపోవడంతోనే చేరిక జాప్యం అవుతున్నట్లు సమాచారం. ఈసారి ఖానాపూర్ టికెట్ ఆదివాసీకి ఇవ్వాలనే ఆలోచనతో ఆమెకు ఆదిలాబాద్ ఎంపీగా అవకాశం ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ఆఫర్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఆమె సందిగ్ధంలో పడి ఆలోచనలు చేస్తున్నట్లు చెబుతున్నారు. పార్టీ టికెట్ ఇస్తే తప్పకుండా గెలిచి చూపిస్తానని పట్టుబడుతున్నారు. ఈ విషయం ఢిల్లీ ఏఐసీసీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు రేఖానాయక్ భర్త శ్యామ్‌నాయక్ ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీకి సిద్ధపడ్డారు. తనకే సీటు ఖాయంగా చెబుతూ ప్రచారం ముమ్మరం చేశారు. ఇక్కడ మొదటి నుంచి ఆదివాసీ స్థానంగా ఉన్న నేపథ్యంలో ఈసారి ఈ విధానం మార్చి కొత్త ప్రయోగం చేద్దామనే కోణంలోనూ కాంగ్రెస్ అధిష్టానం ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఖానాపూర్‌ను ఆదివాసీ, ఆసిఫాబాద్‌ను లంబాడాకు ఇస్తే ఎలా ఉంటుందనే చర్చలు జరుగుతున్నాయి. ఈ ప్రయోగం ప్రకారం బోథ్ నియోజకవర్గంలో ఎలా సర్దుబాటు చేస్తారనేది వేచి చూడాలి. పార్టీలో చేరికపై ఎమ్మెల్యే రేఖానాయక్ 'సాక్షి'తో మాట్లాడుతూ 'ఇంకా చర్చలు నడుస్తున్నాయని.. ఏ విషయమైనా త్వరలోనే వెల్లడిస్తా' అని చెప్పారు.

సిబ్బంది వేతనంపై ఎఫ్‌ఆర్వో నజర్!

- పైగా విధుల నుంచి తొలగించే యత్నం

బెజ్జూర్: కార్యాలయ సిబ్బంది కష్టార్జితంపై కన్నేశాడు ఓ అటవీ శాఖాధికారి.. ఐదునెలల జీతం ఖాతాలో పడిన విషయాన్ని గ్రహించి సదరు సిబ్బందిని తన కార్యాలయానికి పిలిపించాడు. బ్యాంక్ ఖాతాలోని డబ్బులను బలవంతంగా డ్రా చేయించి వాటిని కాజేసేలా ప్రణాళిక రచించాడు. మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన ఆలం ముత్తయ్య చింతలమానెపల్లి మండలం కర్జెల్లి అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో బేస్ క్యాంప్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నాడు. ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఐదు నెలలుగా జీతం రాకపోవడంతో ముత్తయ్య ఆర్థికంగా అనేక అవస్థలు ఎదుర్కొంటున్నాడు. ఇటీవల వేతనాలు బ్యాంక్ ఖాతాలో జమయ్యాయి. కాగా, అటవీశాఖ రేంజ్ అధికారి గత సోమవారం ముత్తయ్యను పిలిపించాడు. తన జీపు డ్రైవర్ ద్వారా ముత్తయ్యను కౌటాల మండల కేంద్రంలోని ఎస్‌బీఐకి పంపించాడు. అక్కడ ఆయన ఖాతాలో జమ అయిన రూ.48వేలు బలవంతంగా డ్రా చేసేలా భయాందోళనకు గురిచేశాడు. అందులోంచి రూ.12,500 మాత్రమే సిబ్బందికి చెల్లించిన ఎఫ్‌ఆర్వో చంద్రమౌళి మిగతా డబ్బులు తన వద్దే ఉంచుకున్నట్లు ముత్తయ్య బుధవారం 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపాడు. నెల రోజులుగా అనారోగ్యం కారణంగా అప్పుడప్పుడు బేస్ క్యాంపు విధులకు హాజరు కాకపోవడంతోనే సంబంధిత అధికారి తన వేతనం డబ్బులు ఉంచుకున్నట్లు పేర్కొన్నాడు. పైగా తనను విధుల నుంచి తొలగించే ప్రయత్నం చేస్తున్నట్లు వాపోయాడు. ఈ విషయమై సంబంధిత అధికారిని వివరణ కోరగా.. ముత్తయ్యకు సంబంధించిన డబ్బులు తనవద్దే ఉన్నాయని తెలిపారు. అతడు కొద్దినెలలుగా విధులకు గైర్హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగానే అతడిని విధుల నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు



వాసవీ మందిరంలో మహిళలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో దేవీ శరన్నవ రాత్రి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరుపుకొంటున్నారు. పట్టణంలోని ఆలయాలు, వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద శారదా, దుర్గామాత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాపూనగర్‌లోని శారదామాత విగ్రహానికి శాకాంబరి అవతారంగా కూరగాయలతో అలంకరించారు. కేశవనాథ ఆలయంలో నిత్యం ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నిత్యం భజనతో పాటు సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం చేపడుతున్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- సెక్టార్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ఎన్నికల నిర్వహణలో భాగంగా సెక్టార్ అధికారులు ఈవీఎం, వీవీ ప్యాట్లు, హ్యాండ్‌బుక్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వేణుతో కలిసి ఆసిఫాబాద్ నియోజకవర్గ సెక్టార్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని తెలిపారు. సెక్టార్ అధికారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులు, ర్యాంపులు, నీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్, ఫ్యాన్లతో పాటు పోలింగ్ కేంద్రంలో అవసరమున్న మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. వసతుల వివరాలు సంబంధిత ఫార్మాట్లో అందించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ తేదీకి వారం ముందు నుంచే సెక్టోరల్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ సిబ్బందిని కేంద్రాలకు తీసుకువెళ్లడం, తీసుకురావడంతోపాటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలుంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని, రిజర్వ్ ఈవీఎం అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ రోజు తమకు కేటాయించిన రూట్ పరిధిలో శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతీ పోలింగ్ కేంద్రంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సమస్యలుంటే రిటర్నింగ్ అధికారికి వివరాలతో నివేదిక అందించాలని తెలిపారు. హ్యాండ్‌బుక్‌లోని ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సమావేశంలో మాస్టర్ ట్రైనర్లు తంగడిపెల్లి రమేశ్, గంగిశెట్టి శ్రీనివాస్, ఊశన్న, సెక్టార్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఓటు.. పాట్లు

- జిల్లాలో 74 సమస్యాత్మక కేంద్రాలు
- 46 మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు
- పకడ్బందీ ఏర్పాట్లలో అధికారులు
- సజావుగా నిర్వహణకు సన్నాహాలు



మానిక్‌పటార్‌లో షెడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

పోలింగ్ బూత్‌కు దారేది?



చింతకర్ర ప్రాథమిక పాఠశాల పోలింగ్ బూత్

జైనూర్: మండలంలోని చింతకర్ర గ్రామం దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంటుంది. సరైన రవాణా సదుపాయం కూడా లేదు. ఉట్నూర్–ఆసిఫాబాద్ ప్రధాన రహదారి నుంచి ఈ గ్రామం ఎనిమిది కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. మరుగుదొడ్లు, వసతి సౌకర్యం కూడా లేదు. ఇక్కడ 455 మంది ఓటర్లున్నారు. ఇక్కడి ప్రాథమికపాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి సిబ్బంది చేరుకోవాలంటే నానా పాట్లు పడాల్సిందే.

గుట్టల మధ్య పోలింగ్ కేంద్రం

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ మండల కేంద్రానికి 45కిలోమీటర్ల దూరంలో మాలిని గ్రామం ఉంది. ఈ గ్రామంలోనే తొలి పోలింగ్ కేంద్రం ఉండగా, రాష్ట్ర తొలి ఓటరు కూడా ఇక్కడే ఉంటారు. మాలిని గ్రామపంచాయతీ పరిధి మానిక్‌పటార్ గ్రామంలో ఈసారి నూతనంగా పోలింగ్ కేంద్రాన్ని కేటాయించారు. ఇక్కడ తడకల పాఠశాల ఉండగా, పోలింగ్ కేంద్రం నిర్వహణకు ప్రస్తుతం శాశ్వత షెడ్డు నిర్మిస్తున్నారు. మాలిని నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో మానిక్‌పటార్ ఉండగా, ఎడ్లబండి దారిలో ప్రయాణించాల్సి ఉంటుంది. దారి మొత్తం రాళ్లు, రప్పలతోనే ఉండటంతో వాహనాలు కూడా వెళ్లలేవు. ఇక్కడికి అతికష్టం మీద ద్విచక్ర వాహనాలపై వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడ సిగ్నల్ వ్యవస్థ లేక సెల్‌ఫోన్లు కూడా లేవు. గుట్టల మధ్య ఉన్న ఈ పోలింగ్ కేంద్రంలో 79 మంది ఓటర్లు ఉండగా, 38మంది పురుషులు, 41మంది మహిళా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఆసిఫాబాద్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించగా ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గతంలో అల్లర్లు, గొడవలు జరిగిన సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 4,47,634 మంది ఓటర్లుండగా, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2,24,661 మంది, సిర్పూర్ నియోజకవర్గంలో 2,22,973 మంది ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 597 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, వీటిలో ఆసిఫాబాద్‌లో 304, సిర్పూర్‌లో 293 ఉన్నాయి. వీటిలో 74 సమస్యాత్మక, 46 మావోయిస్టు ప్రభావిత కేంద్రాలను అధికారులు గుర్తించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నవంబర్ 30న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

గత అనుభవాలతోనే..

రాజకీయ పార్టీల మధ్య గొడవలు జరగడం, రహదారి సౌకర్యం లేక పోవడంతో పాటు ఫోన్ సిగ్నల్స్ లేని గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. తిర్యాణి మండలం మొర్రిగూడ పోలింగ్ స్టేషన్‌కు సమీప గ్రామాలకు చెందిన వారు సుమారు ఏడు కిలోమీటర్లు నడిచి వెళ్తారు. ఎన్నికల సమయంలో అలాంటి గ్రామాల్లో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య గొడవలు జరిగే అవకాశాలున్నాయి. గతంలో జరిగిన ఎన్నికల్లో పోలీసులు ఓ పార్టీకి మద్దతుగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఇతర పార్టీలకు చెందిన నాయకులు ఆందోళనలు చేయడంతో ఘర్షణ, గొడవలు జరుగుతున్నాయి. దీంతో పాటు పోలింగ్ కేంద్రాలకు కొందరిని అనుమతించడంతో ఇతర పార్టీల నాయకులు ఆందోళనలు చేస్తున్నారు. గతంలో పలుచోట్ల అల్లర్లు, గొడవలు జరగగా అధికారులు వాటికి కారణాలు తెలుసుకుంటున్నారు. ఈసారి ఆ పరిస్థితి పునరావృతం కాకుండా చూస్తున్నారు. అల్లర్లకు కారణమయ్యేవారిని ముందుగా గుర్తించి బైండోవర్ చేయడంపై దృష్టి సారిస్తున్నారు. మావోయిస్టుల ప్రభావంతో గతంలో 2004లో జరిగిన ఎన్నికల్లో తిర్యాణి మండలం మంగి గ్రామానికి ఆసిఫాబాద్ నుంచి హెలిక్యాప్టర్‌లో పోలింగ్ బాక్స్‌లు తీసుకెళ్లారు.

సమస్యాత్మక గ్రామాలివే..

ఆసిఫాబాద్ మండలం బూర్గుడ, ఈదులవాడ, రహపెల్లి, తిర్యాణి మండలం మొర్రిగూడ, రొంపెల్లి, అర్జున్‌లొద్ది, ఆస్నుగూడ, తాటిగూడ, కెరమెరి మండలం పరందోలి, ముకద్దమ్‌గూడ, కెరమెరి, సాంగ్వి, కెలిబి, దేవాపూర్, కరంజివాడ, అంతాపూర్, దహెగాం మండలం లోహ, రావులపల్లి, మెట్టుగూడ, రాంపూర్, బిగుడతో పాటు ఏజెన్సీలో పలు గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. దీంతో పాటు తిర్యాణి మండలం పంగిడి మాదర, గోవెన, మంగి, గుండాల, కెరమెరి మండలం టోకెన్ మోవాడ్, కొటారి, ఆసిఫాబాద్ మండలం మోవాడ్, అడదస్నాపూర్, రౌటసంకెపెల్లితో పాటు పలు గ్రామాలను మావోయిస్టు ప్రభావిత గ్రామాలుగా గుర్తించారు. దీంతో పాటు తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని అంతాపూర్, పరందోలి, పద్మావతి, నారాయణగూడ, కోటతో పాటు 12 వివాదాస్పద గ్రామాలుండగా, ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ కూడా పోలీసులు బందోబస్తు చర్యలు చేపడుతున్నారు.

ముందు జాగ్రత్తలు తీసుకుంటాం

జిల్లాలోని సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ స్టేషన్లను గుర్తించాం. హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా చూస్తాం. కేంద్ర బలగాలతో పాటు పోలీసులతో బందోబస్తు చర్యలు చేపడతాం. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. – సురేశ్‌కుమార్, ఎస్పీ

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- నెలవారీ సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రతీ పోలీస్ అధికారి అప్రమత్తతతో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడానికి పంచే డబ్బు, మద్యం ఇతర సామగ్రి జిల్లాలోకి ప్రవేశించకుండా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలని తెలిపారు. బెల్ట్‌షాపులకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేలా పోలీస్‌స్టేషన్ల వారీగా కఠినత్వాన్ని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా ప్రతిరోజూ పెట్రోలింగ్, ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ, ఎన్నికల సమయంలో కేంద్రాన్ని సమీపించే దారులను పరిశీలించాలని తెలిపారు. ఉదయం 6నుంచి రాత్రి 10గంటల వరకు ప్రచార అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సూర్యాస్తమయం తర్వాత ప్రచారం చేయరాదని తెలిపారు. పోలీస్‌శాఖ ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ల వారీగా కేసుల వివరాలు తెలుసుకున్నారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పని చేసి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. జిల్లాలో అధికంగా నేరాలు జరిగే ప్రాంతాల్లో హాట్‌స్పాట్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నిర్మూలించాలని, మట్కా, గంజాయి, పేకాట లాంటి వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని తెలిపారు. ఎన్నికల సమయంలో మట్కా, బెల్ట్‌షాప్‌లు నిర్వహించే వారిని, రౌడీషీటర్లను బైండోవర్ చేసి కట్టడి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో ఏవో శ్రీనివాస్‌రెడ్డి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్, డీసీఆర్‌బీ సీఐ రమేశ్, సీసీఎస్ సీఐ ముత్యంరాజు, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవోకు సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా విద్యాశాఖాధికారి అశోక్‌ను పీఆర్టీయూ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఈవో కార్యాలయం నూతన సమీకృత భవనంలోకి మారిన తర్వాత మొదటిసారిగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలు తెలిపి పరిష్కరించాలని కోరారు. కాగా, ఎన్నికల తర్వాత అన్ని అంశాలపై నిర్ణయాలు వెలువడతాయని డీఈవో తెలియజేసినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, ప్రకాశ్, నాయకుడు ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



డీఈవోను సన్మానిస్తున్న నాయకులు

16 మంది ఎమ్మెల్యేలు.. ఆరుగురు మంత్రులు





చిల్కూరి రామ చంద్రారెడ్డి | పడాల భూమన్న | జోగు రామన్న | అమర్‌సింగ్ తిలావత్ | గోడం రామారావు | గోడం నగేష్

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐదుగురు
- స్వరాష్ట్రంలో ఒక్కరు..
- బోథ్‌లో తండ్రీకొడుకులు మంత్రులుగా బాధ్యతల నిర్వహణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వీటి పరిధిలో ఇప్పటి వరకు 16 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ప్రజల మద్దతుతో ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టడమే కాకుండా అందులో ఆరుగురు రాష్ట్ర మంత్రులుగానూ సేవలందించి రాష్ట్ర చరిత్రలో తమపేర్లను లిఖించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐదుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా సేవలందించగా స్వరాష్ట్రం సిద్ధించాక ఏర్పడ్డ తొలి క్యాబినెట్‌లో ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే జోగు రామన్న ఐదేళ్ల పాటు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

15 సార్లు ఎన్నికలు.. 8 మంది ఎమ్మెల్యేలు

1952లో ఏర్పడ్డ ఆదిలాబాద్ నియోజకవర్గానికి ఇప్పటివరకు ఒక ఉపఎన్నికతో కలిపి 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు 13 సార్లు ఎన్నికలు జరగగా ఏడుగురు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇందులో దాజీ శంకర్ (1952), విట్టల్‌రావు దేశ్‌పాండే (1962), కష్టాల రామకిష్టు (1967), మసూద్ హైమద్ (1972), చిల్కూరి రామచంద్రారెడ్డి (1978, 1985, 1989, 2004), చిల్కూరి వామన్‌రెడ్డి (1983, 1994), పడాల భూమన్న (1999), జోగు రామన్న (2009, 2012)ఎమ్మెల్యేలుగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో జోగు రామన్న ఎమ్మెల్యేగా గెలుపొందారు. వరుసగా ఐదోసారి గెలిచి రికార్డు సృష్టించాలని భావిస్తున్న ఆయన మరోసారి ఈ ఎన్నికల బరిలో నిలిచారు.

13 ఎన్నికలు.. 8 మంది ఎమ్మెల్యేలు

బోథ్ నియోజకవర్గం 1962లో ఏర్పడింది. ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి రాష్ట్రంలో 11 సార్లు ఎన్నికలు జరుగగా ఏడుగురు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. సి.మాధవరెడ్డి (1962), ఎస్‌ఏ.దేవ్‌షా (1967, 1972), అమర్‌సింగ్ తిలావత్ (1978), కాశిరాం (1983), గోడం రామారావు (1985, 1989), గోడం నగేష్ (1994, 1999, 2009), సోయం బాపురావు (2004)విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావించాక 2014, 2018లో రాథోడ్ బాపురావు ఎన్నికయ్యారు. మూడోసారి అదేపార్టీ తరఫున బరిలోకి దిగి హ్యాట్రిక్ సాధించాలని ఆశపడ్డ ఆయనకు బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ ఇవ్వకుండా షాకిచ్చింది. దీంతో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

ఆ ఆరుగురు మంత్రులు వీరే..

ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో 16 మంది ఎమ్మెల్యేలుగా గెలుపొందగా అందులో ఆరుగురు మంత్రులుగా రాష్ట్రానికి సేవలందించారు. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన చిల్కూరి రామచంద్రారెడ్డి రాష్ట్ర మార్కెటింగ్, గిడ్డంగులశాఖ మంత్రిగా నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి క్యాబినెట్ పనిచేశారు. టీడీపీ తరఫున 1999లో ఎమ్మెల్యేగా గెలిచిన పడాల భూమన్న చేనేత, జౌళిశాఖ మంత్రిగా చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో సేవలందించారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఘనత సొంతం చేసుకున్నారు. ఇక బోథ్ నియోజకవర్గం నుంచి 1978లో ఎమ్మెల్యేగా గెలుపొందిన అమర్‌సింగ్ తిలావత్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా కోట్ల విజయ్ భాస్కర్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన గోడం రామారావు గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా నందమూరి తారకరామారావు క్యాబినెట్‌లో పనిచేశారు. తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన గోడం నగేశ్ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబు క్యాబినెట్‌లో గిరిజన, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి, మరోసారి రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్‌గా సేవలందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంపీగా గెలుపొందినా మరుసటి ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ బోథ్ అసెంబ్లీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆ పార్టీ అభ్యర్థి అనిల్‌జాదవ్ గెలుపు బాధ్యతలను తన భుజాన వేసుకుని ముందుకు సాగుతున్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన ఎన్నికల్లో మూడోసారి ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన జోగు రామన్న కేసీఆర్ తొలి క్యాబినెట్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి స్వరాష్ట్రంలో ఆయా శాఖల తొలిమంత్రిగా రికార్డు సృష్టించారు.

ఎవలి అక్కెర వాళ్లది!



బెల్లంపల్లి: అదినే.. ఓ అదినే.. రామన్నున్నడా.. అనుకుంట ఏగిలివారంగనే పండ్లపుల్ల నములుకుంట అచ్చిండు లింగన్న. ఎవలుల్లా.. అనుకుంట బియ్యం చెర్గుతున్న చాట బట్టుకుని ఇంట్లకెల్లి గల్మ కాడికచ్చి చూసింది లచ్చక్క. అయ్యో పిలగా నువ్వా.. గొడ్లిడ్సే యాళ్లకుగా చింతకింది పెంటయ్యచ్చి రాగి చెట్టుకాడ్కి మీ అన్నను తోడ్కెల్లిండని చెప్పింది. గట్లనా అదినే.. అట్లయితే నేను సుత అక్కడ్కే బోతన్న.. అనుకుంట కాళ్లకు పన్జెప్పిండు లింగన్న. రాగి చెట్టుకాడ్కి ఎల్లంగనే రామన్న, పోశన్న, రాయలింగు, పెంటయ్య, చాంద్‌భాయ్, ధర్మయ్య ముచ్చట్లు బెట్టుకుంట కన్పించిండ్లు. ఇగో లింగన్న గీ పక్కకచ్చి కూసో అని చేయి జూపిచ్చిండు ధర్మయ్య. లింగన్న ఆళ్లకు జతగల్సి చాంద్‌భాయ్ పక్కకు బోయి గూసున్నడు.

గంతట్లనే... ఐతే మానేగానీ రామన్న.. ఈ తాప ఎలచ్చన్ల ఎవలెవలు పోటీల ఉంటండ్లు.. ఎవరైన ఖరారైండ్లా.. అని రాయలింగు అడిగిండు. ఇప్పటికైతే గా గులాబీ పార్టోల్లు దప్పా కద్మ పార్టీలన్నీ గా పనిమీదనే ఉన్నయ్ అని ఇడమర్చిసెప్పిండు రామన్న. ఐతే చెయ్యి గుర్తోళ్ల కిరికిరి ఇంకా వొడ్వలేదా.. అని ఓరగా జూస్కుంట అన్నడు పెంటయ్య. అరే భయ్యా గాళ్ల పంచాయితీ ఎన్నడన్న తెగదెంపులైందా చెప్పు.. ఒకళ్లు ఎడ్డమంటే ఇంకొకళ్లు తెడ్డమంటరు. గంత సులువుగైతదా గాళ్ల సీట్ల పంచాయితీ అని మెల్లగ మాట గలిపి దెప్పిపొడ్సిండు చాంద్‌భాయ్. గట్లేంలేదుగని 55 మంది పోటీ జేసెటోళ్ల పేర్లను సాటింపు జేసిండ్లు. కదుమోళ్ల పేర్లను కొద్ది దినాలల్ల ఎల్లగక్కుతరట అన్నడు రామన్న.

గాళ్ల పంచాయితీ పక్కకు బెట్టుగని.. గా ఎర్ర జెండ పార్టోళ్లతోనైనా సీట్ల సోపతి కుదిరిందా? గాళ్ల మాట ముచ్చట ఎందాకచ్చిందని పెంటన్నడిగిండు... రాష్ట్రాన్ని ఏలుతున్న పార్టీ మళ్లోపారి గెల్వకుండ కాంగ్రెస్, కమ్యునిస్టు పార్టీలు కల్సి పోటి జెత్తమని ఎవలకాళ్లు జెప్పుకుంటండ్లు. ఇప్పటిదాక సీపీఐ, సీపీఎం పార్టీలకు ఎవలకెన్ని సీట్లిచ్చుడో మాట కుదిరిందట గని ఏఏ సీట్లిచ్చుడనేది ఇంకైతే సుతికి రాలేదట. ఇంకోపారి ఆళ్లు ఈళ్లు గూసోని ముచ్చటించుకుంటరట.. సూడాలె మరి సీట్ల పొత్తు ఎప్పటికి ఖరారైతదో అని రామన్న బదులిచ్చిండు. మరి గా కమలం పువ్వోళ్ల ముచ్చట్లు సుత జెరంత జెప్పే రామన్నని పోశన్నడిగిండు. గీళ్ల పంచాయితీ సుత ఇంకా మోకకు రాలే.. అంతా ఢిల్లీ పెద్దలు చూస్కుంటమన్నరట.. అయితే టిక్కెట్ ఎవలకత్తదో.. ఏందో దెల్వక కమలం పువ్వోళ్లు సుత లోలోపల కుమిలి పోతండ్లని రామన్న చెప్పంగనే... పెంటయ్య ఇంకో జోలి దీసిండు. అవ్వుగనీ..

ఇప్పటిదాక టిక్కెట్ రానోళ్లంత సడీసప్పుడు జేయకుండా ఊర్కెనే ఉన్నరా చాంద్‌భాయ్ అని రాయలింగు అడిగిండు. గాళ్లెందుకు ఊకుంటరు. ఏపార్టోల్లు పిల్సి టిక్కెట్ ఇత్తరో అని గుడ్లుగూబ లెక్క జూస్కుంట కొందరుంటే ...ఇంకొందరు టిక్కెట్ ఇస్తమని మాటిత్తే చాలు కండువా మారుత్తమని ఎదురు పార్టోల్లతోని రాయబారాలు జేత్తండ్లని చాంద్‌భాయ్ ఎర్కజెప్పిండు. గట్లయితే ఇప్పటిదాక ఎవలైనా పార్టీలు మారిండ్లా అని లింగన్న అడ్గంగనే ..ఎందుకు లేరు భయ్యా... గాళ్ల పేర్లెందుగ్గని ఆ పార్టీల టిక్కెట్ రాదని తెల్వంగనే నిన్నామొన్న పొట్టుపొట్టు తిట్టి .. ఇజ్జత్ మానం దీసిన పార్టీలనే షరికై గల్లలెగరేత్తండ్రని చాంద్‌భాయ్ చెప్పిండు. ఇప్పుడే గిట్లుంటే ముందు ముందు ఎవలెవలు ఎన్నెన్ని సిన్నెలు పడ్తరో.. ఏందో.. అన్కుంట ధర్మయ్య నిట్టూర్చిండు. ఏమోనే ఎవలెటు పోతే మనకేందిగనీ అంబటాళ్ల దాటి పోయింది.. కడుపుల సురసురమంటంది..ఇండ్లళ్ల కెల్దాం నడువుండ్రని రామన్న అనంగనే కూసునోళ్లంత పైకి లేచి ఇంటి దారి పట్టిండ్లు.

క్లుప్తంగా

మద్యం పట్టివేత

జన్నారం: మండలంలోని రేండ్లగూడ, మందపల్లి, పొన్కల్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ బాబా తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై రాబర్ట్ తమ సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా రూ.5,300 విలువైన మద్యం బాటిళ్లు దొరికాయన్నారు. ఈ మేరకు మద్యంతో దొరికిన సత్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

షెడ్‌పూర్‌లో...

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని షెడ్‌పూర్‌లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టుకున్నట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం బేర లచ్చన్నకు చెందిన కిరాణం దుకాణంలో తనిఖీలు నిర్వహించగా రూ.4,130 విలువైన మద్యం లభించినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో బుధవారం చోరీ జరిగింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఎరవెల్లి శ్రీనివాస్ దుకాణానికి కూరగాయల విత్తనాలు కావాలని ఇద్దరు వ్యక్తులు వచ్చారు. శ్రీనివాస్‌ను మాటల్లోకి దించారు. వచ్చిన వారిలో ఒకరు కౌంటర్‌లోంచి రూ.40వేలు తీసుకుని వెళ్లిపోయాడు. ఆ తర్వాత మరో వ్యక్తి టమాట విత్తనాలు కొనుగోలు చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటన జరిగిన అరగంట తర్వాత కౌంటర్‌లోని డబ్బులు కనబడక పోవడంతో దుకాణంలోని సీసీ కెమెరా రికార్డింగ్‌ను పరిశీలించగా విషయం తెలిసింది. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'సెక్యూరిటీ సిబ్బందిపై వేధింపులు ఆపాలి'



మాట్లాడుతున్న భాగ్యరాజ్

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్‌అండ్‌పీసీ సెక్యూరిటీ సిబ్బందిపై అధికారులు వేధింపులు ఆపాలని సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజ్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని సెక్యూరిటీ కార్యాలయం వద్ద బుధవారం ఆయన మాట్లాడారు. చిన్నచిన్న తప్పిదాలకు సస్పెండ్లు, చార్జిషీట్లు ఇస్తూ సెక్యూరిటీ సిబ్బందిని వేధిస్తున్నారన్నారు. కంపెనీ ఆస్తుల పరిరక్షణ కొరకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి రక్షణ లేకుండా పోయిందన్నారు. అన్ని చెక్ పోస్టుల వద్ద కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లు, తాగు నీటి సదుపాయం, ప్రత్యేక గది సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు బానేశ్, సెక్యూరిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మూడెకరాల్లో పత్తిపంట ధ్వంసం



ధ్వంసమైన పంటను చూపిస్తున్న రైతు

జైనూర్: చేతికి అందివచ్చిన పత్తి పంటపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేసి ధ్వంసం చేయడంతో నిరుపేద రైతు కుటుంబం ఆందోళన చెందుతోంది. బుధవారం రైతు రహీంఖాన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మండలంలోని పారా గ్రామ పంచాయతీ శివారులోని ఐదెకరాల్లో రైతు రహీంఖాన్ ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి పంట సాగుచేశాడు. ఈ నెల 16న సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిమందు పిచికారీ చేయడంతో మూడెకరాల్లో పంట పూర్తిగా ధ్వంసమైంది. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా పత్తి పంట నెలకొరిగి ఉండడంతో సదరు రైతు లబోదిబోమన్నాడు. ఈ ఏడాది పంట బాగుండడంతో చేసిన అప్పులు తీరుతాయని ఆశపడ్డానని వాపోయాడు. నిందితులను కఠినంగా శిక్షించి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

పంపిణీకి సిద్ధంగా ఉన్న చీరలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న చీరలు

మంచిర్యాలక్రైం: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పంపిణీకి సిద్ధంగా ఉంచిన చీరలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం పట్టణంలోని తిలక్‌నగర్ 3వ వార్డులో కాంగ్రెస్ కౌన్సిలర్ మాజిద్ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 59 చీరలు లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. చీరలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి ఏడాది జైలు

కౌటాల: మండలంలోని కౌఠి గ్రామానికి చెందిన బోర్కుట్ వినోద్‌కు పోక్సో కేసులో ఏడాది జైలుశిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ పోక్సోకోర్టు ప్రత్యేక జడ్జి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. 2018లో గ్రామంలోని ముగ్గురు మహిళలు, ఇద్దరు బాలికలు ఇళ్లల్లో స్నానం చేస్తుండగా వినోద్ వీడియోలు, ఫోటోలు తీసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

నిండుకుండలా 'ఎల్లంపల్లి'



నీటితో కళకళలాడుతున్న ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యంతో కళకళలాడుతోంది. బుధవారం రాత్రి వరకు ప్రాజెక్టులో 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 20.150 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 6 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. హైదరాబాద్‌కు 316 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 242 క్యూసెక్కులు, రెండు గేట్లు ఎత్తి 6 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

'21న టోకెన్ సమ్మెలో పాల్గొనాలి'

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులు ఈ నెల 21న టోకెన్ సమ్మెలో పాల్గొనాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. బుధవారం ఆర్కే 7 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 16న చెల్లించాల్సిన లాభాల వాటా చెల్లించకపోవడం, పండుగ ముందు చెల్లించే దసరా అడ్వాన్స్‌ను ఎన్నికల కోడ్ పేరుతో ఆపివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ రెండు రోజుల్లో చెల్లించకుంటే 21న సమ్మెలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు కే.వీరభద్రయ్య, బాజీసైదా, కొట్టే కిషన్‌రావు, మల్లేశ్, మారుపెల్లి సారయ్య, బేర రవీందర్, ఆకుల లక్ష్మణ్, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

20న లాభాల వాటా చెల్లింపు

శ్రీరాంపూర్: ఎన్నికల కోడ్ పేరుతో కంపెనీ నిలిపివేసిన లాభాల వాటా, దసరా అడ్వాన్స్‌ను ఈనెల 20న చెల్లించనున్నట్లు గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తమ యూనియన్ అధ్యక్షుడు బీ వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య ఇటీవల యాజమాన్యంతో మాట్లాడగా 20న చెల్లించడానికి ఒప్పందం కుదిరిందన్నారు. గురువారం పే షీట్ తయారు కావడం జాప్యమైతే 21న తప్పక చెల్లిస్తారని సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఒకరిపై ఒకరు పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన గోలివాడ రాజేందర్‌కు హాజీపూర్‌కు చెందిన ముచ్చకుర్తి శ్రీలతతో మూడేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఒక పాప సంతానం. ఏడాదిగా వారి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండటంతో రెండు నెలల క్రితం శ్రీలత కూతుర్ని తీసుకుని హాజీపూర్‌లోని పుట్టింటికి వచ్చింది. మంగళవారం తన భార్యను తీసుకుని వెళ్లేందుకు వచ్చి బావమరిది శ్రీకాంత్‌ను సైతం అసభ్యపదజాలంతో తిట్టడంతో ఇరువురు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనపై బుధవారం ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న దేశీదారు బాటిళ్లు పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. బుధవారం వాహనాల తనిఖీలో భాగంగా మహారాష్ట్ర నుంచి వస్తున్న బస్సులో తనిఖీలు నిర్వహించగా 125(90 ఎంఎల్) దేశీదారు బాటిళ్లు పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన జి.గోపాల్ (23) వ్యసనాలకు బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల నగదు పట్టివేత



కనకయ్యకు రశీదు అందిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో డబ్బుల పట్టివేత పరంపర కొనసాగుతోంది. బుధవారం పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్, ఎస్సై, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా బెల్లంపల్లిలోని షంషీర్‌నగర్ బస్తీకి చెందిన సిరికొండ కనకయ్య వద్ద రూ.3 లక్షలు, కాంట్రాక్టర్ బస్తీకి చెందిన వొడ్నాల నర్సయ్య వద్ద నుండి రూ.1.20 లక్షలు లభించాయి. ఇరువురి వద్ద నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో జప్తు చేసినట్లు ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. ఈ మేరకు నగదును ఎఫ్‌ఎస్‌టీ అధికారులకు అప్పగించారు. కాల్‌టెక్స్ ఏరియా వద్ద జరిపిన తనిఖీలో షేక్ జమీల్ వద్ద రూ.50,500, హరిబాబు వద్ద రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై రమేశ్ తెలిపారు.

మంచిర్యాలలో రూ.90 వేలు

మంచిర్యాలక్రైం: పెద్దపెల్లికి చెందిన బెజ్జంకి రాజేందర్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా రూ.90 వేల నగదుతో తిరుగుతుండగా స్థానిక బస్టాండ్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. నగదును ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి మధుకర్‌కు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

వాంకిడిలో రూ.3 లక్షలు

వాంకిడి: మండలంలోని జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇరువురి వద్ద పట్టుబడిన రూ.3,17,862 నగదును సీజ్ చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

ఎంసీహెచ్‌కు పొంచి ఉన్న ముప్పు?



ఎత్తుగా పోసిన మట్టితో చిన్నగా కనబడుతున్న ఎంసీహెచ్

- భవనం ముందు మట్టిని నింపుతున్న వైనం
- లోతట్టుగా మారడంతో వరదలు వస్తే మరింత ముప్పు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డు గోదావరి నదికి సమీపంలో నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏటా వర్షాకాలంలో వరదలకు నీట మునుగుతోంది. వర్షాకాలం పూర్తయ్యే వరకు ఎంసీహెచ్‌లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులను ఐబీ చౌరస్తాలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. మార్కెట్ యార్డులో మెడికల్ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులను ఇటీవలే ప్రారంభించారు. నిర్మాణ పనుల తవ్వకాల్లో వెలువడుతున్న మట్టిని ఎంసీహెచ్ భవనం ముందు పోస్తున్నారు. దీంతో ఆస్పత్రి భవనం లోతట్టుగా దాని ముందున్న ఖాళీ స్థలం ఎత్తుగా మారుతోంది. భవిష్యత్‌లో మరోసారి వరదలు వస్తే మాత్రం ఎంసీహెచ్‌కు మరింత ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

క్రెడాయ్ జాతీయ కార్యవర్గంలో చోటు



కృతజ్ఞతలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: నిర్మాణ రంగ సంస్థ క్రెడాయ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఉన్న మంచిర్యాలకు చెందిన వి.మధుసూదన్‌రెడ్డికి క్రెడాయ్ జాతీయ కార్యవర్గంలో చోటు దక్కింది. ఈ సందర్భంగా క్రెడాయ్ జాతీయ కార్యదర్శి గుమ్మి రామిరెడ్డి చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. డిసెంబర్ 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే క్రెడాయ్ నేషనల్ స్టడీ టూర్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించనున్నట్లు మధుసూదన్ రెడ్డి తెలిపారు.

ఆరోగ్య ఉపకేంద్రం సందర్శన

జైపూర్: మండలంలోని గంగిపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బ రాయుడు బుధవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచేందుకు గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కల్పిస్తున్న వైద్య సేవలను వివరించాలని సూచించారు.

పొలిటికల్ కూలీలకు గిరాకీ

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఓ పార్టీ గతేడాది నుంచి విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తోంది. ప్రచారంలో మందిమార్బలంతో కొంతహడావుడి చేయాలి. ఇందుకోసం రోజువారీగా కూలీలను వినియోగిస్తే.. ఖర్చుతడిసి మోపెడుతుందని నాయకులు భావించారు. ఇంకేముంది.. తాము ఎక్కడికి వెళ్లినా.. ధర్నాలు, ర్యాలీలు, ఇంటింటా ప్రచారం చేసినా.. తమతో సుమారు 100మంది అనుచరులు ఉండేలా పెయిడ్ కార్యకర్తలను నియమించుకుంటున్నారు. వారికి నెలవారీగా జీతభత్యాలు చెల్లిస్తూ వస్తున్నారు.

పెద్దపల్లిలో మరోపార్టీ ఎమ్మెల్యేగా అభ్యర్థిత్వం ఖరారుతో కుటుంబ సమేతంగా ఎన్నికల ప్రచారం హోరెత్తిస్తున్నారు. అయితే, వారితో పార్టీ కేడర్ తక్కువ, పెయిడ్ కార్యకర్తలు ఎక్కువగా కనిపిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయకూలీలకు పనిలేకపోవడం, ఎన్నికల సీజన్ ప్రారంభంకావడంతో చాలామంది రోజువారీ కూలీలు ప్రచారానికి వెళ్తున్నారు. దీంతో గ్రామాల్లో జెండా మోసేకూలీలకు గిరాకీ పెరిగింది.

- జిల్లాలో ప్రచారం జోరు పెంచిన పార్టీలు
- ఇంటింటి ప్రచారం, ర్యాలీలతో హోరెత్తిస్తున్న వైనం
- లీడర్స్ వెంట క్యాడర్ పేరిట రాజకీయ కూలీలు
- పర్మినెంట్ కూలీలను ఏర్పాటు చేసుకుని నెలవారీ జీతాలు



సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల పండుగ రావడంతో పొలిటికల్ కూలీలకు గిరాకీ పెరిగింది. ఎమ్మెల్యే అభ్యర్థి అంటే మినిమం పక్కన వందో, యాభయో మంది ఉండాలి. నేతల వెంట నడిచే కార్యకర్తల సంఖ్యను బట్టి ఆ నాయకుడి బలాన్ని అంచనా వేసే సంస్కృతి రాజకీయాల్లో ప్రస్తుతం కనిపిస్తోంది. దీంతో తమ ప్రచారంలో జనాలు వందమందికి తక్కువ కాకుండా ఉండేలా నేతలు చూసుకుంటున్నారు. దీంతో ఏ పార్టీ నేతల సమావేశాలు, ర్యాలీల్లో చూసినా జనం కిక్కిరిసి కనిపిస్తున్నారు. బలప్రదర్శనగా మారుతున్న ప్రచారసరళితో చాలామంది రోజువారీ కూలీలు కూడా ఆయా పార్టీల కార్యక్రమాలకు హాజరై ఉపాధి పొందుతున్నారు. పార్టీ జెండా పట్టుకుని కార్యక్రమంలో పాల్గొంటే, లేదా సమావేశంలో పాల్గొంటే రూ.300 నుంచి రూ.500 వరకు కూలిగా అందుతోంది. మగవాళ్లకైతే డబ్బుతోపాటు మందు, బిర్యానీ అదనంగా చెల్లిస్తున్నారు నేతలు.

ఖర్చులు తడిసి మోపెడు..

పార్టీ జెండా మోసేందుకు వచ్చే దినసరి కూలీలు సవాలక్ష కండీషన్లు పెడుతున్నారు. బహిరంగసభకు వస్తే ఎంతసేపు ప్రాంగణంలో కూర్చోవాలో ముందే చెబితే.. దానినిబట్టే వస్తున్నారు. నేతల ఆలస్యంతో సభ ఆలస్యమైతే.. ఇంకోవంద అదనంగా ఇస్తేకానీ సభపూర్తి అయ్యేవరకు ఉండటం లేదు. తక్కువ అమౌంట్ ఇచ్చినా, ఆలస్యమైనా కార్యకర్తలు తిరుగుముఖం పట్టడంతో నేతలు వారిని సముదాయించలేక తలలు పట్టుకుంటున్నారు.

అట్టహాసంగా యోగాసన పోటీలు ప్రారంభం

- 15 జిల్లాల నుంచి 700 మంది క్రీడాకారుల హాజరు



యోగా క్రీడాకారులతో మనోహర్ కుమార్, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి



క్రీడాకారుడి యోగాసనం

అబ్బురపరిచిన యోగాసనాలు

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ యోగా సంఘం, కరీంనగర్ జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్లో బుధవారం 10వ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు తెలంగాణ వ్యాప్తంగా 15 జిల్లాల నుంచి సుమారు 700 మంది క్రీడాకారులు, 60 మంది కోచ్, మేనేజర్, టెక్నికల్ అఫీషియల్‌లో హాజరయ్యారు. 8 సంవత్సరాల నుంచి మొదలుకొని 45 సంవత్సరాల్లోపుతో పాటు 45కు పైగా ఉన్నవారికి పురుషులకు, మహిళలకు, బాలబాలికలకు వేరువేరుగా పోటీలను నిర్వహించారు. రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో అద్వితీయ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నవంబర్ 23 నుంచి 26 వరకు అస్సాం రాష్ట్రం గౌహతిలో జాతీయ స్థాయి యోగా పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. అంతకుముందు ఉదయం ఈ పోటీలను మానేరు విద్యాసంస్థల అధినేత, ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం ప్యాట్రన్ కడారి అనంతరెడ్డి, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి కె.మనోహర్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో యోగాసనాలను ప్రతి ఒక్కరూ చేయాలన్నారు. మానేరు విద్యాసంస్థలు క్రీడలకు, క్రీడాపోటీల నిర్వహణకు ఎల్లప్పుడు ముందుంటుందని, ప్రతీ సంవత్సరం ఏదో ఒక క్రీడలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కరీంనగర్ జిల్లా నాలుగోసారి ఆతిథ్యం ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. యోగాకు కేరాఫ్ అడ్రస్‌గా కరీంనగర్ జిల్లా మారిందని, ఇక్కడి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. జిల్లా ఒలంపిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేష్ రెడ్డి, యోగా సంఘం జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి సిద్దారెడ్డి, ఉపాధ్యక్షుడు కన్నకృష్ణ, రాష్ట్ర యోగ సంఘం బాధ్యులు కమలాకర్ బాలరాజుతోపాటు కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు చేసిన యోగా విన్యాసాలు అబ్బురపరిచాయి. ముఖ్యంగా 8 నుంచి 10 సంవత్సరాల చిన్నారులు, 45 సంవత్సరాల వయసు పైబడిన మహిళలు, పురుషుల యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

తొలిరోజు విజేతలు వీరే..

8 నుంచి 10 సంవత్సరాల బాలికల విభాగంలో సిహెచ్ నితిగ్న చౌదరి, రంగారెడ్డి(ప్రథమ) అభిలాష రెడ్డి, నల్గొండ(ద్వితీయ) చేరుబ అమరిస్, నిజామాబాద్(తృతీయ) స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో చిన్మయ్ రెడ్డి(రంగారెడ్డి), కుష్వక్ రెడ్డి(హైదరాబాద్), మన్విత్ రామ్(కరీంనగర్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.

తెలంగాణలో పర్యటన కొత్త అనుభూతి

- జిల్లాలో విదేశీ మహిళల యాత్ర
- ఉమ్మడి జిల్లాలో బైక్ రైడ్



మోటారుసైకిళ్లపై మహిళలు



బహుమతి అందజేస్తున్న విదేశీ మహిళ

జన్నారం: తెలంగాణ రాష్ట్రంలో బైక్ రైడ్ ద్వారా పర్యటించడం కొత్త అనుభూతిని ఇచ్చిందని విదేశీ మహిళలు పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా హైదరాబాద్ నుంచి మోటార్‌సైకిళ్లపై వివిధ దేశాల మహిళలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల, కడెం ప్రాంతాల్లో పర్యటించారు. మంగళవారం రాత్రి మంచిర్యాల జిల్లా జన్నారంలోని హరిత రిసార్ట్‌లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. మండలంలోని గిరిజన గ్రామం మల్యాలలో మహిళలతో మాట్లాడారు. బతుకమ్మ ఆటను తిలకించారు. బుధవారం ఉదయం అటవీ డివిజన్‌లోని మైసమ్మకుంట, బైసన్‌కుంట ప్రాంతాల్లో పర్యటించి వరంగల్‌కు పయనమయ్యారు. యూఎస్ఏ, సింగాపూర్, యూరప్, థాయిలాండ్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన తొమ్మిది మంది మహిళలు అలిసన్ గ్రున్ ప్రారంభించిన ఫ్రీ డబ్ల్యూ, ఒక ఫ్రెంచ్ మోటార్‌సైకిలిస్ట్, మహిళలకు ఆర్థిక అవకాశాలను అందించేందుకు అసాధారణమైన మోటార్‌బైక్ రైడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. మోటారుసైకిళ్లపై తెలంగాణలో పర్యటిస్తూ మహిళలను కలవడం, బతుకమ్మ సంబరాలు, పర్యాటక ప్రదేశాలను సందర్శించడం, కళాకారులు, చేనేత కార్మికులను కలుసుకోవడం కోసం తెలంగాణను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు.

బైక్ ర్యాలీ ఇలా..

మహిళా బైకర్ల తొమ్మిది రోజుల మోటార్ సైకిల్ యాత్ర మహబూబ్‌నగర్, వికారాబాద్, నిర్మల్, వరంగల్ జిల్లాలతోపాటు పోచంపల్లి మీదుగా హైదరాబాద్ వరకు సాగి అక్కడ బతుకమ్మ వేడుకలతో ముగుస్తుంది.

సంప్రదాయాలు నచ్చాయి..



తెలంగాణ రాష్ట్రంలో పర్యటించడం, జన్నారంలో అడవుల అందాలు తిలకించడం, గిరిజనులతో మమేకమై మాట్లాడడం కొత్త అనుభూతినిచ్చింది. గిరిజన మహిళల బతుకమ్మ ఆటలను తిలకించి కొందరికి బహుమతులు అందించాం. తెలంగాణ పర్యటనలో చాలా విషయాలు తెలుసుకున్నాం. సంస్కృతి, సంప్రదాయలు బాగా నచ్చాయి.

– పెన్ని, యూఎస్ఏ

ఉద్యోగుల నిబద్ధతతోనే ప్రగతి పథం

- ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్



ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్ఎం

ఆదిలాబాద్: ఉద్యోగుల నిబద్ధతే సంస్థను ప్రగతి పథంలో ముందుకు నడుపుతోందని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపో గ్యారేజీలో బుధవారం ఏర్పాటు చేసిన సెప్టెంబర్ ఆదర్శ ఉద్యోగుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సంస్థను లాభాల బాట పట్టించేలా నిరంతరం ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉద్యోగులు, సిబ్బంది శ్రమ ఫలితంగానే ఇటీవల శ్రావణమాసం చాలెంజ్లో రాష్ట్రంలోనే ఆదిలాబాద్ రీజియన్ మూడో స్థానంలో నిలిచిందన్నారు. డిపో పరిధిలో నెలరోజులకు, జోనల్ పరిధిలో ఆరు నెలలకు, రాష్ట్రస్థాయిలో ఏడాదికి ఒకసారి ఉద్యోగుల పనితీరుపై అభినందన సభల ఏర్పాటు ఉంటుందన్నారు. ఇదే ఉత్సాహంతో పనిచేసి వందరోజుల గ్రాండ్ చాలెంజ్లో ఆదిలాబాద్ రీజియన్ మొదటి స్థానం సాధించేలా పాటుపడాలన్నారు. అనంతరం ఆర్ఎంను ఉద్యోగులు సన్మానించి, జ్ఞాపిక అందించారు. అలాగే దసరా పండుగ పురస్కరించుకొని డిపోలో పని చేస్తున్న స్వీపర్లకు ఆర్ఎం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు ప్రణీత్, ప్రవీణ్, డీఎం కల్పన, ఎంఎఫ్ రాజేందర్, సీఐ విశ్వనాథ్, రిజర్వేషన్ ఇన్‌చార్జి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నీడ కోసం పాట్లు



వాహనాలను చెట్ల నీడలో నిలిపిన దృశ్యం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని కాలేజీ రోడ్డులో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం వద్ద ఒక్క చెట్టు కూడా లేకపోవడం, వాహనాల పార్కింగ్‌కు సరైన నీడ సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అర కిలోమీటరు దూరంలోని రోడ్డు డివైడర్ల మధ్య ఉన్న చెట్ల నీడనే వాహనాలను నిలపాల్సి వస్తోంది. గర్భిణులను దూర ప్రాంతాల నుంచి ఎంసీహెచ్‌కు తరలించే 102 వాహనాలతోపాటు ఆలనా వాహనాలు సైతం ఎంసీహెచ్‌కు వచ్చి చెట్ల కింద పార్కింగ్ చేసి ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.

బాసరలో భక్తుల రద్దీ



ప్రసాదం పంపిణీ చేస్తున్న సభ్యులు

భైంసా: బాసరలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు బుధవారం అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ప్రత్యేక క్యూలైన్‌లో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం చిన్న పిల్లలతో అక్షరాభ్యాస పూజలు జరిపించారు. భక్తులకు మహారాష్ట్రలోని ధర్మాబాద్ వ్యాపార సంఘం సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు. లక్ష్మీకాంత్, మారుతిపటేల్‌తోపాటు పలువురు నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ప్రసాదాలు పంపిణీచేస్తున్నారు. మరోవైపు నాందేడ్‌కు చెందిన జగదీశ్ మహారాజ్ గాడిపుర ఆధ్వర్యంలో నిత్యాన్నదానం చేస్తున్నారు. ఆలయ ఈవో విజయరామారావు నిత్యాన్నదానంలో భక్తులకు వడ్డించారు.



నిత్యాన్నదానంలో భక్తులు

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 52 పోస్టులు

మచిలీపట్నంలోని ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ.. కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 52
» **పోస్టుల వివరాలు:** ఫిజియోథెరపిస్ట్–02, స్టాఫ్ నర్స్–24, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్–08, మెడికల్ ఆఫీసర్–10, ఎల్‌జీఎస్–04, సపోర్టింగ్ స్టాఫ్–03, సెక్యూరిటీ గార్డ్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సర్టిఫికేట్ కోర్సు,జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, పరాసుపేట, నాయర్ బడ్డీ సెంటర్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.10.2023.
» **వెబ్‌సైట్:** krishna.ap.gov.in

అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 56 పారా మెడికల్ పోస్టులు

అనంతపురం ఆరోగ్య వైద్య,కుటుంబ సంక్షేమ శాఖ..అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 56
» **పోస్టుల వివరాలు:** ఫార్మసిస్ట్ గ్రేడ్2–02, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2–02, రేడియోగ్రాఫర్–01, థియేటర్ అసిస్టెంట్–08, ల్యాబ్ అటెండెంట్–02, పోస్ట్ మార్టమ్ అసిస్టెంట్–03, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్/రికార్డ్ అసిస్టెంట్–02, జనరల్ డ్యూటీ అటెండెంట్ జీడీఏ/ఎంఎన్‌వో/ఎఫ్ఎన్‌వో–28, ఆఫీస్ సబార్డినేట్–01, ప్లంబర్–05, ఎలక్ట్రీషియన్–01, ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రిక్ టెక్నీషియన్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ,డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ, నర్సింగ్ ఆర్డర్లీ కోర్సు, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అనంతపురంలోని హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలోని నిర్దిష్ట కౌంటర్లలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.10.2023.
» **వెబ్‌సైట్:** ananthapuramu.ap.gov.in

ప్రకాశం జిల్లాలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టులు

ఒంగోలులోని కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం.. కనిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఈ–డివిజనల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
» **అర్హత:** బీసీఏ/బీఎస్సీ/బీఈ, బీటెక్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.22,500 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.10.2023.
» **వెబ్‌సైట్:** prakasam.ap.gov.in

విజయనగరం జిల్లా హాస్పిటల్‌లో వివిధ ఉద్యోగాలు

విజయనగరంలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
» **పోస్టుల వివరాలు:** ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రీ టెక్నీషియన్–02, జనరల్ డ్యూటీ అటెండెంట్–05, ఆఫీస్ సబార్డినేట్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, బీఎస్సీ(ఆడియాలజీ), డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అర్హత కలిగిన సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో పాటు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, జిల్లా ఆసుపత్రి, విజయనగరం కార్యాలయంలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.10.2023.
» **వెబ్‌సైట్:** https://vizianagaram.ap.gov.in

జెన్‌కోలో.. ఏఈ జాబ్స్

టీఎస్ జెన్‌కో 339 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్ అర్హతతో ఈ ఉద్యోగాలకు పోటీపడొచ్చు. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు. జెన్‌కో పరీక్ష తేదీని కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ జెన్‌కో ఏఈ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

» 339 ఏఈ పోస్టులకు టీఎస్ జెన్‌కో నోటిఫికేషన్
» బీటెక్ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
» డిసెంబర్ 3న రాత పరీక్ష
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకం

తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్.. టీఎస్ జెన్‌కోగా సుపరిచితం. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలను నిర్వహించే ఈ సంస్థ.. మానవ వనరుల నియామకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రతి ఏటా ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. తాజాగా.. అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

నాలుగు బ్రాంచ్‌లు.. 339 పోస్టులు

- టీఎస్ జెన్‌కో తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం నాలుగు బ్రాంచ్‌లలో 339 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–145 పోస్టులు, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్– 42 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–74 పోస్టులు; లిమిటెడ్ రిక్రూట్‌మెంట్–3 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)–జనరల్ రిక్రూట్‌మెంట్–25 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–1,లిమిటెడ్ రిక్రూట్‌మెంట్–49 పోస్టులు
- నాలుగు బ్రాంచ్‌లకు సంబంధించి లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ పరిధిలో 94 పోస్టులు, జనరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో 245 పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

విద్యార్హతలు

- ఏఈ(ఎలక్ట్రికల్): ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. ▪ ఏఈ(మెకానికల్): మెకానికల్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- ఏఈ(ఎలక్ట్రానిక్స్): ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ పవర్/పవర్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

వయసు

జూలై 1, 2023 నాటికి 18–44 ఏళ్లు ఉండాలి. ఎస్సీ / ఎస్టీ/ ఓబీసీ(నాన్ -క్రీమీలేయర్)/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు ఇస్తారు.

వేతనం

తుది విజేతల జాబితాలో నిలిచి నియామకం ఖరారు చేసుకుంటే.. రూ.65,600–రూ.1,31,220 వేతన శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.

ఎంపిక ఇలా

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా రిజర్వేషన్లు, లోకల్ కేడర్ తదితర నిబంధనలను అనుసరించి తుది జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు. ఆ క్రమంలో ఆయా కేటగిరీల వారీగా కనీస అర్హత మార్కుల నిబంధనను అమలు చేస్తారు. ఓసీ, ఈడబ్ల్యూఎస్, క్రీడాకారుల కేటగిరీకి చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులు; బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; పీహెచ్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి.

వంద మార్కులకు రాత పరీక్ష

- రాత పరీక్షను రెండు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్–ఎలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 80 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్–బిలో ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, తెలంగాణ హిస్టరీ, సంస్కృతి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నమోదైన అభివృద్ధి, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. రాత పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
- పరీక్షను ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తారు.

రెండేళ్ల ప్రొబేషన్, శిక్షణ

నియామకం ఖరారైన వారికి రెండేళ్ల పాటు ప్రొబేషన్, శిక్షణ విధానాన్ని అమలు చేస్తారు. తొలి ఏడాదిని శిక్షణ సమయంగా, రెండో ఏడాదిని ప్రొబేషన్ పీరియడ్‌గా పరిగణిస్తారు. ప్రొబేషన్ నిబంధనలతోపాటు.. సర్వీస్ బాండ్‌ను కూడా టీఎస్ జెన్‌కో అమలు చేస్తోంది. నియామకం ఖరారు చేసుకున్న వారు ట్రైనింగ్, ప్రొబేషన్‌లకు కేటాయించిన రెండేళ్లతో కలిపి.. మొత్తం అయిదేళ్లపాటు జెన్‌కోలో విధులు నిర్వహిస్తామని సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.



ఎస్ఈ స్థాయికి చేరుకునే అవకాశం

టీఎస్ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా కొలువు దీరిన వారు.. భవిష్యత్తులో సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. సర్వీసు నిబంధనలను అనుసరించి.. ఏఈ తర్వాత.. అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, ఆ తర్వాత డివిజనల్ ఇంజనీర్, అనంతరం సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థానాలకు పదోన్నతులు లభిస్తాయి. చీఫ్ ఇంజనీర్ స్థాయికి కూడా చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**అక్టోబర్ 29,2023
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబర్ 3, 2023
- **రాత పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, సికింద్రాబాద్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో.
- **వెబ్‌సైట్:** www.tsgenco.co.in

రాత పరీక్షలో రాణించేలా

- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఎలక్ట్రికల్ మెటీరియల్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ బ్యాటరీస్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్,డీసీ మెషీన్స్, మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఎస్టిమేషన్, యుటిలైజేషన్ అండ్ ట్రాక్షన్, పవర్ ఎలక్ట్రానిక్స్‌కు, అనలాగ్ అండ్ డిజిటల్ ఎలక్ట్రానిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, థర్మోడైనమిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణ అవగాహన పొందాలి.
- **మెకానికల్ బ్రాంచ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, మెకానిక్స్ ఆఫ్ మెటీరియల్స్, థియరీ ఆఫ్ మెషీన్స్, వైబ్రేషన్స్, థర్మోడైనమిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, క్యాస్టింగ్, ఫార్మింగ్, జాయింగ్ ప్రక్రియలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా.. కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్ అండ్ ప్లానింగ్ కంట్రోల్, ఇన్వెంటరీ కంట్రోల్, ఆపరేషన్స్ రీసెర్చ్ ఐసీ ఇంజన్స్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **సివిల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, సాలిడ్ మెకానిక్స్, స్ట్రక్చరల్ అనాలిసిస్, బిల్డింగ్ మెటీరియల్ అండ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఫ్లూయిడ్ మెకానిక్స్, ఓపెన్ ఛానెల్ ఫ్లో, పైప్ ఫ్లో, హైడ్రాలజీ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, వాటర్ సప్లై ఇంజనీరింగ్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జియో టెక్నికల్ ఇంజనీరింగ్, ఎయిర్ పొల్యూషన్, సర్వేయింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ విభాగాల్లోని అంశాల్లో దృష్టి పెట్టాలి.
- **ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ అభ్యర్థులు..** నెట్‌వర్క్స్, సిగ్నల్స్, సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్, అనలాగ్ సర్క్యూట్స్, డిజిటల్ సర్క్యూట్స్, కంట్రోల్ సిస్టమ్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెజర్‌మెంట్స్‌కు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి.
- జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ కోసం ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. తెలంగాణకు సంబంధించి ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించాలి. తాజాగా అమలవుతున్న అభివృద్ధి పథకాలను తెలుసుకోవాలి. తెలంగాణ ప్రాంత భౌగోళిక స్వరూపం, విశిష్టతలు తెలుసుకోవాలి. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన చరిత్రపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తెలంగాణ తొలి ఉద్యమ దశ నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు పలు ముఖ్యమైన అంశాలను ఔపోసన పట్టాలి.వీటితోపాటు తెలంగాణ సంస్కృతి, సామాజిక పరిస్థితులు, కళలు, సాహిత్యం వంటి అంశాలను కూడా చదవాలి.

ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అనలిటికల్ ఎబిలిటీ విషయంలో గ్రాఫ్స్, డేటా అనాలిసిస్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌ను అభ్యసనం చేయాలి.

అన్వయ దృక్పథం

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ముందుకు సాగాలి. ముఖ్యంగా సబ్జెక్ట్ విభాగానికి సంబంధించి బీటెక్ స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను ఆలంబనగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. మోడల్ పేపర్లు, మాక్ టెస్టులు రాయడం కూడా పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపేందుకు దోహదం చేస్తుంది.